


# 10. గోడలు

తలనొప్పితో బాగా చికాకనిపించి ఫైలు మూసేసింది రేవతి. టైము చూస్తే మూడు గంటలయింది. "చలికాలంలో మూడు గంటల నుంచీ టైము కదలటం మానేస్తుంది. ఐదు గంటలవాలంటే యింకా చాలా గంటలు గడపాలి" అంది పక్కనే టైపు చేస్తున్న భారతి. రేవతి చిన్నగా నవ్వి—

"అందుకే శలవు పెట్టి వెళ్ళిపోదామని చూస్తున్నా తలనొప్పి విపరీతంగా వుంది" అంది.

"రెండు గంటల కోసం లీవెందుకండీ ? పర్మిషన్ తీసుకొని వెళ్ళొచ్చుగా" భారతి ఆశ్చర్యాన్ని పట్టించుకోకుండా రేవతి లీవ్ లెటర్ రాసింది.

"శలవులుంటే పెట్టటమే మంచిదిలెండి· సంవత్సరానికోసారి పర్మిషన్ అడిగినా మీ ఆడవాళ్ళకి ఇళ్ళ మీదే ధ్యాస, పర్మిషన్లడిగి ఇళ్ళకు పోవాలని తప్ప ఆఫీసు పని ఎట్లా చేద్దామా అని ఆలోచించరు అని గొణుగుతాడా ముసలాయన" అంటూ రేవతి శలవు పెట్టటానికి తన మద్దతు ప్రకటించింది రమ·

రేవతి రమ మాటలకు అంగీకరిస్తున్నట్లు ఆమె వైపు చూసి నవ్వింది. లీవ్ లెటర్ ఇచ్చి ఆఫీసు నుంచి బైట పడింది.

బస్‌స్టాపు దగ్గర ఆ టైములో జనం వుండరు. బస్సులు కూడా ఖాళీగా వుంటాయి. బస్సులో సీటు దొరుకుతుందనే ఆలోచనతో అప్రయత్నంగానే కాళ్ళు

చురుగ్గా నడిచాయి. బస్‌స్టాపు దగ్గర అప్పటికే కూచుని వున్న చంద్రికను చూసి చాలా ఆశ్చర్యపోయి టైము తెలిసినా మరోసారి వాచీ చూసింది. ఈ వేళప్పుడు చంద్రిక యిక్కడ ఎందుకున్నట్లు ?

"చంద్రికా—ఇవాళ ఆఫీసుకు పోలేదా"

చంద్రిక తలెత్తి చూసి కాస్త తత్తరపడింది. వాడిపోయిన ముఖం, ఎర్రగా వున్న కళ్ళు, దీర్ఘాలోచనలో వున్న మనసు- రేవతి ఆశ్చర్యంగా చూసింది.

ఇంతలో బస్ రానే వచ్చింది. చంద్రికనలా వదిలిపెట్టి వెళ్ళి బస్ ఎక్కాలని పించలేదు.

"చంద్రికా మీ ఇంటివైపు బస్‌లు ఈ టైములో ఎక్కువ వుండవు. మా ఇంటికొచ్చి కాసేపు కూచుని వెళ్ళకూడదూ ?"

చంద్రిక ఏమీ చెప్పలేనట్లు బేలగా చూసింది.

"ఫరవాలేదులే- సాయంత్రం వరకూ వుండి వెళ్దువుగాని" చంద్రిక చెయ్యి పట్టుకుని హడావుడిగా బస్ దగ్గరకు నడిచింది. బస్సంతా ఖాళీగా వుంది. ఇద్దరూ కూచున్నాక బస్ కదిలిన తర్వాత పరీక్షగా చంద్రిక వంక చూసింది. చంద్రిక మాట్లాడకుండా, రాననకుండా, చెయ్యి లాక్కోకుండా బస్ఎక్కిన తీరు కూడా రేవతికి ఆశ్చర్యంగానే ఉంది.

"ఒంట్లో బాగాలేదా ?"

రేవతి ప్రశ్నకు బాగానే వుందని సమాధానం చెప్పి కిటికీలోంచి బైటికిచూస్తూ కూచుంది చంద్రిక. రేవతి యింకేం ప్రశ్నలు అడగకుండా మౌనంగా కూచుంటే బాగుండునన్నట్లుంది ఆమె ధోరణి.

"ఏమై ఉంటుంది ? ఎందుకంత దిగులుగా వుంది ? రఫీతో గొడవ పడిందా? ఇద్దరూ పోట్లాడుకోలేదు గదా ! అసలు తన దగ్గరకు రావాలనే బయల్దేరిందా? తను పిలవకపోయినా తన దగ్గరకు వచ్చేదా ?" రేవతికి పెద్ద పజిల్ తన ఎదుట వున్నట్లని పించింది.

చంద్రిక తన దగ్గరకని బయల్దేరి రావటం మామూలు పరిస్థితుల్లో బొత్తిగా జరిగేపని కాదు.

రవిని పెళ్ళి చేసుకోటానికి వేరు కాపు - న్ని షరతుగా పెట్టిన చంద్రిక రేవతికి ఎప్పుడూ దూరంగానే ఉంది. రేవతిని దగ్గరకు రానివ్వలేదు. పెళ్ళయిన రెండో నెలలోనే వేరుగా ఇల్లు చూసుకున్నారు. మొదటి నెలలో కూడా పట్టుమని పది రోజులుకూడా అత్తగారింట్లో ఉండలేదు. పుట్టింటికీ, స్నేహితుల యిళ్ళకూ, హనీ మూన్‌కూ తిరగడంతోనే సరిపోయింది. వేరు కాపురం పెట్టాక రేవతిని తన యింటి విషయాల్లో జోక్యం చేసుకునే అవకాశం ఏ మాత్రం యివ్వలేదు. ఏ సందర్భం లోనూ రేవతి సహాయం అడగలేదు. ఉద్యోగం చేసుకుంటూ ఇంటిపని చూసు కోవటం అవస్థగానే వున్నా అత్తగారిని మటుకు దగ్గరకు రానివ్వలేదు. రేవతి బంధువులూ, స్నేహితులూ విడ్డూరంగా చెప్పుకున్నారు. ఒకరిద్దరు ఆగలేక రేవతిని అడిగేశారు- "ఉన్నది ఒక్క కొడుకు. ఆ కొడుకూ ఊళ్ళో వుంటూ నువ్వు వేరుగా ఉండటం ఏమిటి.... పోనీ ఏనాడో రెండేళ్ళు కలిసి వుండి—మాకు పడటం లేదమ్మా ఎవరి దారిన వాళ్ళుండదల్చుకున్నాం అంటే ఆ దారి వేరు. పెళ్లి అవటం అవటమే వేరుపడడం ఏం పద్ధతి. రవిని నాలుగు చివాట్లేసి బుద్ధి చెప్పమంటావా" అని కొద్ది రోజులు రేవతిని సతాయించారు

రేవతి వాళ్ళ ఉత్సాహం మీద నీళ్ళు చల్లింది గానీ రవినీ, చంద్రికనూ పల్లెత్తు మాట వాళ్ళ దగ్గర అనలేదు. "రెండేళ్ళకు పోట్లాడుకుని విడి పోవటం కంటే ముందే వేరుగా ఉండటం నయంలే. ఒకరి మీద ఒకరికి ద్వేషం లేకుండా ఉంటుంది" అని రవిని సమర్థిస్తూ మాట్లాడేది. నాలుగేళ్ళుగా అలాగే సాగిపోతోంది. నాలుగేళ్ళలో చంద్రికకూ రేవతికీ మధ్య దూరం పెరగనూలేదు, తగ్గనూలేదు. రేవతి ఆదివారాలు ఎప్పుడన్నా సాయంత్రాలు వాళ్ల దగ్గరకు వెళితే వాళ్ళు ఎప్పు డన్నా రేవతి దగ్గరకు వచ్చేవాళ్ళు. చంద్రిక పురిటికి వెళ్లిన నెలరోజులు తప్ప రవి కూడా ఎన్నడూ వచ్చి తల్లి దగ్గర వున్నది లేదు. పిల్లాడిని కూడా ఎలాగో తంటాలు పడి పెంచుతోంది గానీ రేవతి సహాయం కావాలని అడగలేదు. అలాంటి చంద్రిక యివాళ తన దగ్గరకు బయల్దేరిందంటే రేవతికి ఆశ్చర్యంతో పాటు సంతోషమూ కలిగింది. విషయమేంటో తెలుసుకోవటానికి యిల్లు చేరేదాక ఆగటం అనవసరమని పించింది.

"ఎటూగాని వేళ బయల్దేరావేమిటి—ఆఫీసు ?" బస్సు రొదలో వినపడదే మోనని పెద్దగా అడిగింది.

"ఆఫీసుకి సెలవు పెట్టి శరత్ వాళ్ళ స్కూల్‌కి వెళ్లి వస్తున్నాను."

చంద్రిక సమాధానంతో రేవతి ముఖం నల్లబడింది. అంటే చంద్రిక తన దగ్గరకు బయల్దేరలేదు. శరత్ స్కూలు తన ఆఫీసు దగ్గరే—స్కూల్లో ఫీజు కట్టి ఇంటికి వెళ్ళబోతోంది. మధ్యలో తను అవసరంగా ఆమెను దారి మళ్లించింది. కానీ రమ్మనగానే రావటం కూడా చిత్రమే. తర్వాత వస్తానని తప్పుకోవచ్చు కదా. ఉన్నంతలో తృప్తిపడే స్వభావమేమో చంద్రిక తన వెంట వస్తున్నందుకే సంతోష పడవచ్చు ననుకుంది. మళ్ళీ ఓసారి ఓరగా చంద్రిక వంక చూసింది. చంద్రిక చాలా అశాంతిగా వున్నట్లు కింది పెదవిని పంటికో నొక్కిపట్టి గట్టిగా నిట్టూర్చింది. ఏవో విషయం వుంది. ఏదో చిక్కులో పడింది పాపం !

చంద్రికను చూస్తుంటే రేవతికి జాలి ముంచుకొచ్చింది. చాలాసార్లు కోడలి గురించి జాలిపడుతూ వుంటుంది ఆమె. ఎప్పుడన్నా సాయంత్రాలు కొడుకుని చూద్దా మని వెళితే చంద్రికను చూసి జాలి పడటమే సరిపోయేది. చంద్రిక ఏరోజూ ఏడు గంటలకు ముందు ఆఫీసు నుంచి రాదు. విపరీతంగా అలసిపోయి వస్తుంది. రాగానే కుక్కర్‌లో ఇన్ని బియ్యం పడేసి స్నానానికి వెళ్ళేది. పొద్దున మిగిలిన కూరలతో భోజనం చేసేవాళ్ళు. మళ్ళీ అవి వెచ్చచేసే ఓపిక కూడా ఉండేది కాదు చంద్రికకు. ఆ కూరలు చల్లగా రుచీ పచీ లేకుండా వుండేవి. రుచి ఎట్లా వస్తుంది? పొద్దున్న ఏడింటికి నిద్ర లేస్తే తొమ్మిదింటికి బైటపడాలి. టిఫిన్లు, కాఫీలు, అన్నం, కూరలా యివన్నీ ఒక్కత్తే చేసుకోవాలి. చదువుకునే రోజుల్లో పని అలవాటు లేదేమో చంద్రిక పని చకచకా చేసుకోలేదు. పని అలవాటు లేదుగానీ చంద్రికకు పనంటే అయిష్టం లేదు. నెమ్మదిగా ఒక పని తర్వాత ఒక పని చేస్తూనే ఉండేది. నిజానికి రేవతి వెళ్ళిన రోజు చంద్రిక చాలా యిబ్బంది పడేది. అత్తగారికి తన యిల్లూ, తన పద్ధతులూ, తన వంటా, తను వడ్డించే పద్ధతి, తినే పద్ధతీ ఏవీ నచ్చవని చంద్రికకు మనసులో అనుమానం కాదు నమ్మకం. అత్తగారు వెళ్ళిపోయేవరకూ, ముళ్ళమీద ఉన్నట్లు వుండేది. చంద్రిక అట్లా ఇబ్బంది పడటం ఎందుకో రేవతికి అర్ధమయ్యేది కాదు. ఆమె చంద్రికనెప్పుడూ ఒక్క మాట అనలేదు. ఆమె నుంచి మర్యా దలు కోరుకోలేదు. ఇల్లు సర్దిపెడదామని ఎన్నిసార్లు అనిపించినా చంద్రికకు పద్ధ తులు తెలియజెబుతున్నట్లు ఉంటుందేమో, చంద్రిక పనులకు వంకలు పెట్టినట్లు ఉంటుందేమోనని ఏమీ చెయ్యకుండా వూరుకునేది. మరకల కప్పుతో చంద్రిక

యిచ్చిన కాఫీని మాట్లాడకుండా చిరునవ్వుతో తాగేది. అత్తగారు మాట్లాడకుండా తాగుతున్నా చంద్రికకు శాంతి ఉండేది కాదు. కాఫీ తాగి ఆ మరకలన్నీ పోయేలా కప్పు కడిగి బోర్లిస్తున్న అత్తగారిని అశాంతిగా చూసేది.

బస్సు ఆగింది. ఇద్దరూ దిగి ఇంటివైపు తిరిగారు. చంద్రిక నీరసంగా నెమ్మదిగా నడుస్తోంది. 'ఒంట్లో బాగోలేకపోయినా పని మానదు. ఆఫీసుకి వెళ్ళటం అసలు మానదు–' శరత్ పుట్టిన కొత్తలో ఓ రోజు మధ్యాహ్నం చంద్రిక ఆఫీసుకు వెళ్ళింది రేవతి. శరత్‌కి స్వెట్టరు అల్లింది. అది యివ్వటం చాలా రోజులు కుదరక చివరికి ఆఫీసులోనైనా చంద్రికకు అందజేద్దామని వెళ్ళింది. వెళ్ళేసరికి చంద్రిక సీట్లో లేదు. పది నిముషాలైనాక బాత్‌రూం నుండి వచ్చింది. చాలా దిగులుగా వుంది ముఖం. చంద్రికను పరిశీలనగా చూస్తే విషయం అర్థమైంది. పాల పోటును తట్టుకోలేక బాత్‌రూంలోకి వెళ్ళి పిండేసి వచ్చింది. రేవతి మనసు కరిగిపోయింది.

"ఇంకో నెల శలవు పెట్టకపోయావా?" అన్నది జాలిగా.

"ఆఫీసులో చాలా పని వుంది అత్తయ్యా, కుదరదు."

"పోనీ పాలు పోయేలా బిళ్ళలు వేసుకోక పోయావా?" ఒద్దనుకుంటూనే అడిగేసింది. చంద్రిక రేవతి తనను విమర్శిస్తున్నదనుకుని ముఖం నల్లగా చేసుకుని "ఉదయం, రాత్రీ పిల్లాడికి పాలిస్తూనే ఉన్నాను. రాత్రిళ్ళు సీసాతో వాడు అసలు తాగడు" అని యిబ్బందిగా చెప్పింది.

మాతృత్వానికీ ఉద్యోగానికీ మధ్య నలిగిపోయే ఆడవాళ్ళను చూడడం రేవతికి కొత్తకాదు. కానీ తన కోడలు కష్టంలో తనేమీ ఆదుకోలేకపోతున్నందుకు మాత్రం చాలా బాధపడింది.

"ఆడవాళ్ళు పని సరిగ్గా చెయ్యరు అనిపించుకోవటం నాకిష్టం ఉండదు. ఆడవాళ్ళు చాలా బాగా పని చేస్తారని నిరూపించాలనిపిస్తుంది."

రవితో చంద్రిక అంటుంటే రేవతి విన్నది. ఆఫీసులో మరీ ఎక్కువ పని నెత్తినేసుకుంటున్నావని రవి కోప్పడుతుంటే చంద్రిక అన్నది ఆ మాటలు. విని రేవతి గుండె నీరయింది. రవికి అర్థం కాలేదుగానీ ఆ మాటలు రేవతికి ఎందుకర్థం కావు.

రేవతిని ఎంతమందో ఎన్నిసార్లో ఆ మాటలు అన్నారు. ఈ ఆడవాళ్ళను ఉద్యోగాల్లో పెట్టుకోవటమంత బుద్ధితక్కువతనం లేదు అన్నారు. అనిపించుకో

కూడదని ఎంత ప్రయత్నించినా అన్నారు. ఆడవాళ్ళు నిండు గర్భాలతో వెళ్ళి పని చేస్తున్నా, రక్తస్రావాలతో వెళ్ళి పని చేస్తున్నా, పిల్లల కివ్వాల్సిన పాలు యింకించు కునీ, పిండి పారబోసుకునీ వచ్చి పనులు చేస్తున్నా అంటూనే ఉంటారు. చిన్న లోపం జరిగితే చాలు ఆడవాళ్ళను ఉద్యోగాల్లో పెట్టుకోవటమంత బుద్ధితక్కువ తనం లేదని మగవాళ్ళకు వెంటనే జ్ఞానోదయమవుతుంది. పాపం ఆ మాట అని పించుకోకూడదని ఎంతో కష్టపడుతోందనుకుంటే కోడల్ని గుండెలకు హత్తుకోవా లనిపించింది రేవతికి. కానీ చంద్రిక కుదరనివ్వదు. అత్తగారి నుంచి ప్రేమతో కూడిన ఓ చూపుగానీ, మాట గానీ చంద్రికకు చాలా యిబ్బంది కలిగిస్తాయి. ఆ అమ్మాయి కళ్ళల్లో ఏదో బెదురు కనిపిస్తుంది. అది గమనించాక రేవతి చంద్రిక నుంచి దూరంగానే ఉంటోంది.

రేవతి తలుపు తాళం తీసి ఇంట్లోకి నడిచింది. వెనకాలే చంద్రిక. ఇంట్లోకి రాగానే చంద్రికకు అంతవరకూ ఆపుకున్న దుఃఖం ఒక్కసారి పెల్లుబికి వచ్చింది. దానిని బలవంతాన అదిమిపెట్టి కుర్చీలో కూలబడింది. 'అత్తగారుండే యిల్లు ఎప్పుడు ఏ టైమ్‌లో వచ్చినా యింతే— చల్లగా పరిశుభ్రంగా సేదదీర్చేలా ఉంటుంది. ఇంటి నెప్పుడూ యిలా వుంచుకోవటం ఈమె కెలా కుదుర్తుంది?'

"ముఖం కడుక్కోరాదూ" అంది రేవతి.

చంద్రిక లేచి బాత్‌రూంలోకి వెళ్ళింది. అక్కడ కూడా అంతే. బాత్‌రూం కూడా డ్రాయింగ్ రూమంత నీట్‌గా వుంది. బకెట్ నిండుగా నీళ్ళు. సబ్బుపెట్టె కొత్తగా వుంది. సబ్బు ఎక్కడా అంటలేదు. సబ్బు సగం పైగా అరిగినా కొత్తది లానే వుంది. అత్తగారింట్లో సబ్బు, సబ్బు పెట్టె ఎప్పుడూ నీళ్ళలో నానవు. అదే తనింట్లో అయితే పెట్టెనిండా ఎప్పుడూ నీళ్ళు. సబ్బు నాని నాని ముక్కలుగా చేతి లోకి వస్తుంది.

చల్లటి నీళ్ళతో ముఖం కడుక్కుని వచ్చేసరికి టవల్ పట్టుకుని నిలబడి వుంది రేవతి.

తెల్లని టవల్ పాతదైనా ఎక్కడా చిన్న మరక లేదు. ఎలా సాధ్యం. పాత టవల్‌ని యింత తెల్లగా స్వచ్ఛంగా ఉంచగలగటం.

ముఖం తుడుచుకుంది చంద్రిక.

రేవతి బాత్‌రూంలోకి వెళ్ళింది.

"ఈసారి ఎబార్షన్ చేయించుకుంటాననదు గదా. ఉద్యోగం మానేస్తుందా? రవి ఎప్పుడూ చంద్రిక ఉద్యోగంమీద దాడి చేస్తాడు. నువ్వు ఉద్యోగం మానేస్తే మనం సుఖంగా బతకొచ్చంటాడా. ఉద్యోగం చెయ్యకుండా నీ సంపాదనతో నేను బతకనంటుంది చంద్రిక. ఈ గొడవ పెద్దదై విడిపోదామనుకోలేదు గదా. అదే నిజమైతే తను ఎంత మాత్రమూ రవి పక్షం వహించదు. రవినే మందలిస్తుంది. చంద్రిక మంచి పిల్ల. ఆత్మగౌరవం వున్న పిల్ల. కష్టపడి పనిచేసే స్వభావం, పనంటే గౌరవం వున్న పిల్ల. ఇంట్లో పద్ధతిగా ఒండి పెట్టేవాళ్లా, చాకిరీ చేసేవాళ్లూ ఎంతమందైనా దొరుకుతారుగానీ ఆత్మాభిమానం వుండీ, దాన్ని కాపాడుకోటానికి నిరంతరం ప్రయత్నం చేసే ఆడపిల్లలు దొరకటం కష్టం. ఆ ఆడపిల్లల విలువ రవిలాంటి వాళ్ళకు తెలియదు. వాళ్ళకు సుఖం కావాలి. ఆత్మ గౌరవం, పోరాటం, వీటి విలువ వీటి గురించి ఆలోచించాల్సిన అవసరం లేనివాళ్ళ కెలా అర్థం ఔతుంది?

రేవతి ముఖం కడుక్కొని వచ్చి టవల్‌తో ముఖం తుడుచుకుని దానిని తీగ మీద ఆరవేసింది. చంద్రిక తుడుచుకున్న టవల్ కోసం చూసింది. అది తడి ముద్దలా కుర్చీలో పడేసి వుంది. రేవతి దాన్ని తీసి గట్టిగా విదిలించి తీగెమీద ఆరవేసింది.

"అత్తయ్యా—మీరీ పనులన్నీ యింతబాగా ఎలా చేస్తారు? ముఖం తుడుచు కోగానే టవల్ ఆరవెయ్యాలని మీకెలా గుర్తొస్తుంది? టవల్ పాతదైపోయినా యింత తెల్లగా ఎలా వుంచుతున్నారు? ఇల్లంతా యింత శుభ్రంగా ఎలా పెట్టుకో గలుగుతున్నారు?"

చంద్రిక హఠాత్తుగా తనేం మాట్లాడుతుందో తనకు అర్థమయ్యేలోపే అడి గేసింది.

రేవతి చిన్నగా నవ్వి ఊరుకుంది. ఏం సమాధానం చెబుతుంది? జీవితమంతా వెచ్చించి అలవర్చుకున్న పద్ధతుల గురించి హఠాత్తుగా అడిగి ఒక వాక్యంలో సమాధానం చెప్పమంటే ఎవరైనా ఎలా చెబుతారు. ఇరవై ఏళ్ళ వయసులో ఏడాది పిల్లాడితో భర్త వదిలేశాడన్న పేరుతో పొట్ట చేతబట్టుకుని నిలబడ్డ తను ఎంత పోరాటం చేసి ఈ పద్ధతులు నేర్చుకుందో ఎలా చెబుతుంది?

తన ఇంట్లో, తన వస్తువుల మీదా మురికీ, దుమ్మూ మరకా లేకుండా వచ్చిన ప్రతివాళ్ళకూ స్వచ్ఛంగా కనబడే ప్రయత్నం ఎంత చేసిందో అంతకు వందరెట్లు తన శరీరం, మనసూ అన్నీ పవిత్రంగా మచ్చలేకుండా వున్నాయని అందరికీ నిరూపించుకోటానికి ప్రయత్నించింది. ఇల్లూ, ఒళ్ళూ అంతా స్వచ్ఛమైన తెలుపు. కానీ ఈ శుభ్రత అంటే, ఈ స్వచ్ఛత అంటే ఒకోసారి తన కెంత అసహ్యం వేస్తుందో ఎవరికీ తెలియదు. ఇల్లంతా దుమ్ముతో ధూళితో మట్టితో నింపాలనిపిస్తుంది. తన ఒంటి నిండా మట్టి, బురదా రాసుకుని విరగబడి నవ్వాలనిపిస్తుంది. నేను పవిత్రంగా ఉండను. మీరేం చేస్తారు? అసలునేనెలా వుంటే మీకేం? ఒక్కపూట ఒక్క ముద్ద నాకుగానీ నా పిల్లడికి గానీ పెడతారా? అని లోకాన్ని ప్రశ్నించాలనిపిస్తుంది. కానీ ఏమీ చెయ్యలేదు. ఆ ఉన్మాదాన్ని తన మెదడులోనే మండిపోనిచ్చి తను పవిత్రంగా పరిశుభ్రంగా ఉంది. అలా ఉండటానికి శరీరంతో, మనసుతో ఎడతెగని యుద్ధం చేసింది. వాటిని చిత్రహింసకు గురిచేసింది. వాటి ఆక్రోశాన్ని నిర్దాక్షిణ్యంగా హత్య చేసింది.

అదంతా ఇప్పుడు చంద్రికకు ఎలా అర్ధం అవుతుంది? తనను దగ్గరకే రానివ్వని ఈ పిచ్చిపిల్లకు తను అదంతా ఎట్లా చెప్పగలుగుతుంది?

కానీ ఒక్కసారి చెప్పనిస్తే బాగుండు. చంద్రిక తనను అర్థం చేసుకోగలదనే నమ్మకం రేవతికి ఉంది. రేవతి అప్పటికప్పుడు తన హృదయాన్ని విప్పి ఆ పిల్ల ముందు వుంచుదామన్నంత ఆవేశంతో చంద్రిక వంక చూసింది.

చంద్రిక కళ్ళల్లో సన్నటి నీటి పొర. ఎందుకు? ఏ కష్టం వచ్చింది? ఎవరేమన్నారు? రవి తొందరపాటుతో ఏ మాట అని కష్టపెట్టాడో? కొట్టాడేమో—అదే నిజమైతే కొడుకుని చెంపలు పగలకొట్టి బుద్ధి చెబుతుంది.

చంద్రిక భుజం మీద చెయ్యి వేసింది రేవతి. చంద్రిక కళ్ళల్లో నీళ్ళు జారి చెంపల మీద పడుతున్నాయి.

"ఏమయిందమ్మా?" రేవతి కంగారుగా అడిగింది.

"శరత్‌ని స్కూల్లోంచి తీసేశారత్తయ్యా—వాడికి చదువు రావటం లేదు. అన్నిట్లో తప్పుతున్నాడు. విపరీతంగా అల్లరి చేస్తున్నాడు. నిన్న రాయి తీసుకుని

ఒకబ్బాయి తలమీద చిల్లుపడేలా కొట్టాడట. ఇవాళ నన్ను పిల్చి వాడిని స్కూల్లోంచి తీసేస్తామని చెప్పారు."

రేవతికి విషయం అర్థమై కంగారు తగ్గింది.

చంద్రిక దుఃఖం మాత్రం ఆగటం లేదు.

"నాకు పిల్లల్ని పెంచటం రాదా అత్తయ్యా. నాకు చేతనైనంత చేస్తూనే వున్నాను. వాడు మారటం లేదు. ఇంక నాకు చేతకావటం లేదు. రవి నాకు పిల్లల్ని పెంచటం రాదని తిడుతున్నాడు. నేనేం చెయ్యను?"

"ఏడిశాడు—వాడు చిన్నప్పుడు శరత్ కంటే ఎక్కువ అల్లరే చేశాడు. ఎంతమంది పిల్లల తలలకి చిల్లులు పెట్టాడో లెక్కలేదు. చదువు మాత్రం ఒచ్చేదా? ఒట్టి మొద్దు."

"నిజమా?" దుఃఖంతో ఎర్రబడ్డ చంద్రిక కళ్ళల్లో ఆశ్చర్యం.

"నిజంగానే."

రేవతి రవి చేసిన అల్లరీ చెయ్యని అల్లరీ అంతా కలగలిపి చెప్పింది.

"అసలు శరత్ స్కూలు మంచిది కాదు. వాళ్ళు బండకొట్టుడు కొట్టడం తప్ప పిల్లలకు చదువంటే యిష్టం కలిగేలా చెప్పటంలేదు. వాడిని ఆ స్కూలు మాన్పించేద్దాం. మొన్ననే ఒక మంచి స్కూల్ గురించి పేపర్లో చదివాను. పిల్లల్ని కొట్టరట. పిల్లలు స్కూల్‌కి పుస్తకాలు మోసుకెళ్ళనక్కర్లేదట. హోం వర్కు యివ్వరట. ఆ స్కూల్లో చేర్పిద్దాం."

"నిజంగా ఆ స్కూలు వుందా ?"

అత్తగారు తనని ఓదార్చటానికి చెబుతుందా అని అనుమానంవచ్చి అడిగింది.

"ఉండు—చూపిస్తా" రేవతి లేచి వెళ్ళి నాలుగు రోజులక్రితం పేపరు తెచ్చి ఆ స్కూలు గురించిన వార్త చూపించింది.

చంద్రిక ముఖంలో ఆందోళనంతా పోయింది.

"రవి మాటలు పట్టించుకోకు. వాడు మగాడు. వాడికేం తెలుసు తల్లుల బాధలు."

రేవతి మాటలతో చంద్రిక ముఖం వికసించింది. ఆ అవకాశాన్ని రేవతి జార విడవదల్చుకోలేదు. మాట్లాడింది. మాట్లాడింది. తామిద్దరం ఆడవాళ్ళం అని చంద్రిక గుర్తించేంతవరకూ మాట్లాడింది.

"నాకు పెళ్ళికి ముందు నుంచీ, చెప్పాలంటే కొంచెం కాస్త ఆలోచించటం తెలిసినప్పటి నుంచీ అత్తగారంటే—ఆ మాటంటేనే భయం. కోడళ్ళను ఏడిపిస్తారు గదా అత్తలు. అత్తపోరు పడలేక కోడళ్ళు ఆత్మహత్యలు చేసుకున్నారని వినేదాన్ని. అత్తకు దూరంగా వుండాలని ఎప్పుడో రవి పరిచయం కాకముందే అనుకున్నాను. రవి ఒక్కడే కొడుకనీ, మీ కెవరూ లేరనీ తెలిశాక నా భయం మరింత పెరిగింది. రవి మీద ఎప్పుడూ మీకే అధికారం కావాలనుకుని, ఇప్పుడు నాకేదో అధికారం వచ్చిందనుకుని నన్ను హింస పెడతారేమోనని బాగా భయపడ్డాను. మిమ్మల్ని చూశాక నా భయం మరింతగా పెరిగింది. మీరు అన్ని విషయాలలోనూ ఫర్ఫెక్ట్. నాకు ఇంటి పనులు చేతకావు. వంటరాదు. మీరు నన్ను విమర్శిస్తారనీ, ఎగతాళి చేస్తారనీ భయపడుతుండేదాన్ని. మీరు యింటికి వస్తే నాకు చాలా గిల్టీగా అనిపించేది. మీ దెక్కడ నన్ను తప్పు పడతారోనని భయంగా ఉండేది. అందుకే మీ నుంచి దూరంగా ఉండాలని ప్రయత్నిస్తుంటాను ఎప్పుడూ.

చంద్రిక వంక ప్రేమగా జాలిగా చూసింది రేవతి. ఆడవాళ్ళ లక్షణాలు కొన్ని, అత్త లక్షణాలు కొన్ని, కోడళ్ళ లక్షణాలు కొన్ని, ఆడపిల్ల లక్షణాలు కొన్ని—ఇన్నింటిని ఆడదాని మీద బలవంతంగా రుద్దిన సమాజం ఆమెలోని మానవ సహజ లక్షణాలను అణిచి వేస్తుందా ? మనుషుల మధ్య ఉండాల్సిన సంబంధాలు ఎంత వికృతమైపోతున్నాయి ? నాలుగేళ్ళపాటు యిద్దరు మనుషుల మధ్య స్నేహం కుదరలేదంటే మానవ సంబంధాలు ఎంత పాడైపోయాయో ? చంద్రిక తేలికయిన మనసుతో అత్తగారి వంక మొదటిసారి స్నేహంగా ప్రేమగా చూసింది.

"కాటుక ముఖం నిండా అయింది. పిచ్చిపిల్లలా ఏడ్చావు. ముఖం కడుక్కురా" అంది రేవతి.

చంద్రిక బాత్‌రూంలోకి వెళ్ళి సబ్బుతో శుభ్రంగా ముఖం కడుక్కుని వచ్చింది. రేవతి యిచ్చిన తువ్వాలతో ముఖం తుడుచుకుని దానిని వెంటనే విదిలించి ఆరవెయ్యబోయింది.

"ఫరవాలేదు. అక్కడ పడెయ్యి. తర్వాత ఆరేసుకోవచ్చు. ఇవాళ నుంచీ నేనూ కాస్త బద్ధకం నేర్చుకుంటాను. ఏమవుతుందో చూద్దాం" అంది రేవతి చంద్రిక చేతిలో తువ్వాలు లాక్కుంటూ.

"ఒద్దత్తయ్యా— నాకు శ్రద్ధా, అలవాటు లేకగానీ, ఎప్పటి పని అప్పుడు చేసుకోవటమే మంచిది" అంది తువ్వాలు ఆరేస్తూ.

"ఎవరికి చేతనైనట్టు వాళ్ళుంటారు. దాన్ని గురించి పూరకే ఆందోళన పడకు" అంది రేవతి కాఫీ కలపటానికి వంటింట్లోకి వెళ్తూ.

రేవతి వెనకాలే చంద్రిక కూడావంటింట్లోకి వెళ్లింది. అత్తగారికి చెప్పాల్సింది యింకా ఏదో వుంది. అది చెప్పాలంటే యిబ్బందిగా మొహమాటంగా వుంది. ఇంత స్నేహం యిద్దరి మధ్య పెరిగాక ఆ మాట మాట్లాడకపోవటం చాలా అన్యాయమని ఒక ప్రక్క చంద్రిక అంతరాత్మ గోల చేస్తోంది. అత్తగారు కాఫీ కలుపుతున్నంత సేపూ మనసులోనే రిహార్సల్ వేసుకుంది. కాఫీ కప్పులు పట్టుకుని యిద్దరూ ముందు గదిలోకి వచ్చారు.

చంద్రిక ఓ గుక్క కాఫీ తాగి

"కాఫీ చాలా బాగుందత్తయ్యా— మీకు మాతో కలిసి ఉండాలనిపిస్తోందా ? అందరం కలిసి ఉందామా ?" తల ఒంచుకుని తప్పు చేసినదానిలా అడిగేసింది.

రేవతి నవ్వింది.

"లేదమ్మా ! నాకిలాగే బాగుంది. మీ పెళ్ళయిన కొత్తలో కాస్త బాధగా ఉంది గానీ యిప్పుడిలా వుండటమే బాగుందనిపిస్తోంది. నేను ఎప్పుదేం చెయ్యాలనిపిస్తే అది చెయ్యగలుగుతున్నాను. ఎవరికే యిబ్బంది కలిగిస్తున్నానో అన్న చింతలేదు. ఎవరికీ యిబ్బంది లేకుండా ఎవరితో యిబ్బంది పడకుండా యిలా వుండటమే బాగుంది. నువ్వు నాకు పరోక్షంగా సాయమే చేశావు. నా టైము నా యిష్టం వచ్చినట్లు ఈ నాలుగేళ్ళ నుంచే ఉపయోగించుకుంటున్నాను. అంతకుముందు ఏవో ఒక బాధ్యత— నాకు మరీ ఓపిక లేనపుడు మీ దగ్గరకే వస్తానుగా." చంద్రికలో వున్న గిల్టీ ఫీలింగ్‌ని తగ్గించి యిద్దరి మధ్యా బంధాన్ని మరింత గట్టిచేసే ప్రయత్నం చేసింది రేవతి.

చంద్రిక మొదటిసారిగా రేవతిని అత్తగారిలా కాక మనిషిలా చూసింది.

— ఆంధ్రజ్యోతి (ఆదివారం) 19-1-92